క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు నలంద డిగ్రీ కళాశాల విద్యార్థి చెవుల తులసి ఎంపికై నట్లు కరస్పాండెంట్ డోలి సత్య నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపికై న తులసిని సోమవారం కళాశాల బృందం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై. కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ జట్టుకు ఈశ్వర్



మహబూబాబాద్ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-14 క్రికెట్ జట్టుకు మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన బొట్ల ఈశ్వర్ తేజ్ ఎంపికై నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి సోమవారం తెలిపాడు.

జాతీయ అవార్డు ప్రదానం



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రానికి చెందిన బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్‌గౌడ్ మహాత్మాజ్యోతిరావు పూలే జాతీయ అవార్డు అందుకున్నాడు. ఢిల్లీలో జరిగిన బహుజన సాహిత్య అకాడమి 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అకాడమి చైర్మన్ నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యన్, ఢిల్లీ మంత్రి ముకేష్‌కుమార్ ఆహ్లావత్ చేతుల మీదుగా సోమవారం జాతీయ అవార్డును అందుకున్నారు.

వైస్ ప్రెసిడెంట్‌గా యోగేశ్వర్ రావు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన మాలె యోగేశ్వర్‌రావు వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మిన్‌స్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు. తమిళనాడులో క్లబ్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా ప్రమాణస్వీకారం నిర్వహించారు. యోగేశ్వర్ రావును పలువురు అభినందించారు.

రోడ్డుపై ధాన్యం బస్తాలు..!



దంతాలపల్లి: మండలకేంద్రం బొడ్లాడ ఎక్స్ రోడ్డు సమీపంలో ఖమ్మం, వరంగల్ జాతీయ రహదారిపై ట్రాక్టర్‌లో తరలిస్తున్న ధాన్యం బస్తాల్లో 12 బస్తాలు సోమవారం రోడ్డుపై పడిపోయాయి. కాసేపటికి గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ వెనక్కి వచ్చి ట్రాక్టర్‌లో బస్తాను లోడ్ చేశాడు.

‘చెకుముకి’లో సత్తా చాటిన విద్యార్థులు

దంతాలపల్లి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో దంతాలపల్లి ఎంజేపీ విద్యార్థులు సత్తా చాటారని సోమవారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఆదిలాబాద్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా కార్యదర్శిగా రమేశ్



దంతాలపల్లి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ శాఖ జిల్లా కార్యదర్శిగా మండలానికి చెందిన ఈదురు రమేశ్ ఎన్నికయ్యాడు.

రెండో రోజు కొనసాగిన దీక్ష

కురవి: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ అన్నారు. కురవి గుడి సెంటర్ వద్ద దళిత రైతు బేతమల్ల సహదేవ్ రెండో రోజు చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ తాజ్‌పాషా, చారీహరీశ్, రమేశ్, రవినాయక్, సయ్యద్ ఖాజా, ఐతం ఉపేందర్ పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

- వారంలో అకౌంట్లలో డబ్బులు జమ
- బోనస్ అందుకున్న అన్నదాతల్లో సంతోషం
- ముందు ప్రైవేట్‌లో ధాన్యం అమ్ముకున్న రైతుల్లో ఆవేదన వ్యక్తం
- ఇప్పటి వరకు 45,745 క్వింటాళ్ల ధాన్యం సేకరణ



అబ్బాయిపాలెంలో బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు

మరిపెడ రూరల్: మండలంలోని వరి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్ సొసైటీల ద్వారా పౌర సరఫరాల శాఖ సేకరిస్తోంది. ఇప్పటి వరకు మండలంలోని 18కొనుగోలు కేంద్రాల ద్వారా 45,745 క్వింటాళ్ల ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని సేకరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని వేగవంతంగా సేకరిస్తున్నారు. మిల్లర్ల సహకారంతో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా ఆయా మిల్లర్లకు తరలిస్తున్నారు. జనవరి నెలఖారు నాటికి ధాన్యం సేకరణ లక్ష్యాలను పూర్తిచేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

45,745 క్వింటాళ్ల ధాన్యం సేకరణ

మరిపెడ మండలంలోని ఏర్పాటు సేచిన పీఏసీఎస్ ద్వారా 23,519 ఏకేపీల ద్వారా 22,226 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని సేకరించి మొత్తం 45,745 క్వింటాళ్లను మిల్లర్లకు తరలించారు. ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి 8లారీలకు తగ్గకుండా ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు సుమారు 175లారీల ద్వారా కొనుగోలు చేసుకున్న ధాన్యాన్ని మిల్లుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. జనవరి నెల చివరి వరకు ధాన్యం కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు.

బోనస్‌తో రైతుల్లో ఆసక్తి

కొనుగోలు కేంద్రాలలో అమ్మకున్న రైతులకు క్వింటాకు రూ.500బోనస్ ఇవ్వంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. వాతావరణం కారణంగా కొందరు రైతులు భయపడి ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకొని బోనస్ కోల్పోయి నష్టపోయారు. బయట వ్యాపారులకు అమ్ముకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్ముకుని ప్రభుత్వం అదనంగా ఇచ్చే బోనస్‌తో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క రూ.2,320 వరికి మద్దతు ధర, మరో పక్క రూ.500 బోనస్‌తో క్వింటాకు రూ.2,820 ధర అందుతుండడంతో రైతులు ఎప్పుడు లేని విధంగా కొనుగోలు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

40క్వింటాళ్ల దిగుబడి వచ్చింది



నాకు రెండు ఎకరాల వరి సాగు ఉంది. సుమారు 40క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎప్పుడైన ప్రైవేట్ వ్యక్తులకే వడ్లను అమ్ముతాను. వారి మాయా మాటలు నమ్మి గతంలో నష్టపోయాను. ఇప్పుడు కొనుగోలు కేంద్రానికి తెచ్చి అమ్ముతున్నాను. దీంతో రూ.20వేలు అదనంగా వచ్చే బోనస్ డబ్బులతో పెట్టిన పెట్టుబడి వస్తుంది.

\- బానోతు లక్పతి, రైతు, అమృనాయక్‌తండా

దాతల చేయూత అభినందనీయం



నెల్లికుదురు: విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందిస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

- డీఈఓ రవీందర్‌రెడ్డి

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం దాతలు చేయూత ఇవ్వడం అభినందనీయమని డీఈఓ ఏ.రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో దాతలు మాలోతు బోజ్యానాయక్ పదవ తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ స్టడీమెటీరియల్స్, పాఠశాల పీఈటి అయిలయ్య విద్యార్థులకు క్రీడా పరికరాలు హాకీ స్టిక్స్, 2005-6 పూర్వపు విద్యార్థులు పాఠశాలకు అందించిన 20 కుర్చీలను డీఈఓ అందించారు. క్రీడలో ప్రతిభ చాటిన విద్యార్థులు సుచరిత, జగన్, రితీష్‌లను డీఈఓ సన్మానించాడు. కాగా మండలంలోని ఆలేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో దాత బీరయ్య గౌడ్ విద్యార్థులకు అందించిన స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ రాందాస్ అందించారు. కాక్యక్రమంలో ఏసీఎం మందుల శ్రీరాములు, హెచ్ ఎం రవి, బీమన్న, యాకయ్య, నరేష్, ఏఏపీసీ చైర్మన్ మమత రాము, శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగండి

మరిపెడ: విద్యార్థులు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని డీఈఓ రవీందర్‌రెడ్డి కోరారు. మరిపెడ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు దాతలుగా అందించిన స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో ఏసీజీఈ శ్రీరాములు, ఎంఈఓ అనితాదేవి, హెచ్‌ఎం అనంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజసేవకు పాటుపడాలి

కేసముద్రం: ప్రతీ ఒక్కరు తమవంతుగా సమాజసేవకు పాటుపడాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెనుగొండ జెడ్పీహైస్కూల్‌లో మాధవపెద్ది అనసూయ, శేషారెడ్డి జ్ఞాపకార్థం అందించిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాలేరు యాదగిరి, దాత మాధవపెద్ది గోపాల్‌రెడ్డి, ఏసీజీ మందుల శ్రీరాములు, షమీనాబేగం, శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య, ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ఏడీఏ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

మహబూబాబాద్ రూరల్: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు దళాలను నమ్మి మోసపోవద్దని డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏడీఏ శ్రీనివాసరావు సోమవారం తనిఖీ నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరపాలని, తూకంలో మోసాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి, ఏఈఓ బి.బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

‘చలో హైదారాబాద్’కు అనుమతి ఇవ్వాలి

నెల్లికుదురు: పేరుకుపోయిన గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న (నేడు) చేపట్టే చలో హైదరాబాద్‌కు అనుమతివ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరాడు. ఈమేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీఓ బాలరాజులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మికులు చాంద్‌పాషా, వెంకన్న, ఐలయ్య, రాంకోటి, మల్లయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

సమస్యల వలయంలో జమాండ్లపల్లి

మహబూబాబాద్ అర్బన్: గత పాలకుల నిర్లక్ష్యం ధోరణి వల్లే జమాండ్లపల్లి 2, 3 వార్డుల్లో సమస్యలు కుంటపడ్డాయని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ అన్నారు. సోమవారం ఆయా వార్డులో సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలేల అధ్వానంగా ఉందన్నారు. కార్యక్రమంలో సైదులు, తిరుపతమ్మ, నాగన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



అలంకరణలో శ్రీరంగనాథ స్వామిగోదాదేవి

గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస ఆరంభాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో స్థానిక సనాతన శివాలయంలో ఆలయ పూజారి సతీష్‌పాం డేయ ఏకశిలపై కొలువుదీరిన శివపార్వతుల విగ్రహాలకు జలాభిషేకం చ

గార్ల: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని లక్ష్మినర్సింహాస్వామి దేవాలయంలో ఘనంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బన్సీలాల్, పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవాలయం, శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయాల్లో ధనుర్మాస పూజలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆయా ఆలయాల అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్, శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామి, సత్యంగౌతం మహారాజ్ ప్రత్యేకంగా శ్రీరంగనాథ స్వామివారు, గోదాదేవి అమ్మవారలకు పూజలు నిర్వహించారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

మరిపెడ రూరల్: జాప్యాన్ని వీడి వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం మరిపెడ మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సోమవారం మండలంలోని తానంచర్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం ఆధ్వర్యంలో సందర్శించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్న పార్టీలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య



మాట్లాడుతున్న అల్వాల వీరయ్య

మరిపెడ రూరల్: జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని కేంద్రం ప్రభుత్వం చూస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య ఆరోపించారు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ సమావేశం నందిపాటి వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా హాజరైన వీరయ్య మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలను 23పార్టీలు, 233 ఎంపీలు వ్యతిరేకిస్తున్నా ప్రధాని మోదీ మొండిగా వ్యవహరిస్తున్నాడన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో అవినీతికి పాలపడ్డారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు గుండగాని మధుసూదన్, బాణాల రాజన్న, జిన్నా లచ్చయ్య, కొండ ఉప్పలయ్య, ఎర్ర వెంకన్న, కామిండ్ల వెంకన్న, జినక సైదులు, జామ్మూర్తి పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎస్సీపీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో కాకతీ కదనభేరి వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 22వ వరంగల్ జిల్లా కేంద్రంలోని ఇస్లామియా గ్రౌండ్ ఆవరణలో పెద్దఎత్తున కాకతీ కదనభేరి నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్ బాబు, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, ఝాన్సీ పాల్గొన్నారు.

ఉషోదయ వాకర్స్ నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: ఉషోదయ వాకర్స్ నూతన కమిటీని జిల్లా కేంద్రంలోని నిర్వహించి సర్వ సభ్య సమావేశంలో ఆదివారం ఎనుకున్నట్లు సీనియర్ సభ్యులు సుంకర వెంకటేశర్లు తెలిపారు. అసోసియేసన్ అధ్యక్షుడిగా పాలబిందెల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఆకుల శంభయ్య, కోశాధికారిగా తండ సదానందం, ఉపాధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శులుగా గోవర్ధన్, అశోక్, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సమ్మిరాజు, పరంధామయ్య, నాగార్జున, శ్రీనివాస్, సలహాదారులుగా కృష్ణమూర్తి, మైపాల్‌రెడ్డి, విజయ్, బొడ్డుపల్లి ఉపేంద్రం, ట్రాక్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఖలీల్, లక్ష్మినర్సింహరావు, వెంకట్‌రెడ్డిలతో పాటు 17 మందిని ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



డోర్నకల్: సర్వే పరిశీలిస్తున్న కోటిలింగం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో 10, 11వ వార్డుల్లో వార్డు అధికారులు ప్రత్యేక యాప్ ద్వారా ఇందిరమ్మ దరఖాస్తుదారుల నుంచి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం, నాయకులు సమేర్‌చంద్ జైన్, శంకర్, వీరభద్రం పరిశీలించారు.

మహబూబాబాద్ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం జరుగుతున్న సర్వేకు ప్రజలు సహకరించాలని టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే నిర్వహించగా వెంకట్ నాయక్ మాట్లాడారు. సంపంగి రామచందర్, వెంకట్ నాయక్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైలుకిందపడి యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: రైలుకింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన వల్లెపు భీమరాజు (33) భార్యతో కలిసి బతుకుదెరువు కోసం వరంగల్ కొత్తవాడకు వలసొచ్చారు. సోమవారం వరంగల్ - కాజీపేట స్టేషన్ల మధ్య శాయంపేట రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని రైలుకింద పడి భీమరాజు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేందర్ వివరించారు.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గూడూరు: మండలంలోని రాజనపల్లి, పానుగోడు, గుండెంగ గ్రామాలలో వాంకుడోతు చందూలాల్, బానోతు హచ్చ, తేజావత్ పూల్‌సింగ్‌లకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ అందించారు.

శబరిమలకు మాలధారులు

పెద్దవంగర: మండలంలోని బొమ్మకల్లు గ్రామానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు స్వామి శరణం.. అయ్యప్ప శరణం అంటూ కీర్తనలు పాడుతూ సోమవారం శబరిమలకు బయలు వెళ్లారు.

హాకీ స్టిక్స్ అందజేత

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నూతన వధూవరులైన పెండ్లి సాయిసాకేత్, కీర్తన దంపతులు రూ.8వేల విలువైన హాకీస్టిక్స్‌ను హాకీ క్రీడాకారులకు సోమవారం అందజేశారు. క్రీడలపై ఉన్న మక్కువతో అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బందెల రాజు, పీడీ కొమ్ము రాజేందర్, రావుల పరమేశ్వర్, నర్మద, పెండ్లి అశోక్, అనిత, రావుల మురళీ, రమేశ్ పాల్గొన్నారు.

సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మదన్‌గోపాల్‌లోయా, మార్వడీ సమాజ్, యువమంచ్, సఖీమండల్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

గార్ల: మండలంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీఓకు సోమవారం వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, వీరన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

గార్ల: చలో అసెంబ్లీకి వెళ్తారనే అనుమానంతో మండలంలోని పీవైఎల్ నాయకులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పీవైఎల్ జిల్లా, మండల కార్యదర్శులు గణేష్, మంగీలాల్, నాయకులు కృష్ణమాచారిని పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు.

ఉపాధి కూలి డబ్బులు చెల్లించాలి

కేసముద్రం: గత వేసవికాలంలో చేసిన ఉపాధి పనులకు చెందిన కూలి డబ్బులను వెంటనే కూలీలకు చెల్లించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు మార్తనేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి సర్వే నిర్వహించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



మరిపెడ రూరల్: దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ అనితాదేవి అన్నారు. సోమవారం మండలంలోని తానంచర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు మరిపెడ మాజీ జెడ్పీటీసీ బాల్ని మాణిక్యం రూ.4వేలతో స్టడీ మెటీరియల్ అందజేశాడు. అదేవిధంగా ప్రతీ ఏడాది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తోపాటు ఎస్సెసీలో ప్రథమ స్థానం రూ.10,116, ద్వితీయ స్థానం రూ.5,116 నగదు బహుమతి అందజేస్తానని దాత మాణిక్యం ప్రకటించాడని తెలిపారు.

దొడ్డు రకం ధాన్యానికి బోనస్ చెల్లించాలి

కేసముద్రం: దొడ్డు రకం ధాన్యం అమ్ముతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బోనస్ చెల్లించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య డిమాండ్ చేశాడు. సోమవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. నాయకులు రంగయ్య, వెంకన్న, యాకుబ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మరిపెడ రూరల్: ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాల్సిందేనని ఎంఈఓ గాదె అనితాదేవి వంట నిర్వాహకులకు సూచించారు. మరిపెడ మండలం గిరిపురం క్రాస్ రోడ్డులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈఓ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు.

డ్రమ్ సీడర్‌తో సాగు చేయాలి

తొర్రూరు రూరల్: రబీలో వరిపంటలను సాగు చేయనున్న రైతులు డ్రమ్ సీడర్ ద్వారానే పంటను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని హచ్చుతండాలో డ్రమ్‌సీడర్ ద్వారా సాగు చేస్తున్న తీరును వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు.

చర్య తీసుకోవాలి

బయ్యారం: మండలంలో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారిని గిరిజనుల పేరుతో ఎల్‌టీఆర్ కేసులు పెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారిపై అధికారులు చర్య తీసుకోవాలని లంబాడీ సంఘం నాయకులు కోరారు. సోమవారం బయ్యారంలో సంఘం నాయకులు రామునాయక్, రాములునాయక్, రవినాయక్, నాగునాయక్ మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు నరేష్, రాజేష్, నర్సింగ్, చంటి, సరిరాం పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు

కురవి: మండల కేంద్రంలోని మరిపెడ వెళ్లే మార్గంతోపాటు ఆలయ సత్రాల వరకు రోడ్లకు దగ్గరకు చిరువ్యాపారులు, పెద్ద షాపులను పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడంతో ఎస్సై సతీష్ ఆదేశాల మేరకు సోమవారం పోలీసులు దుకాణాలను పక్కకు జరిపించారు.

హుస్సేన్‌నాయక్ పరామర్శ

గూడూరు: మండలంలోని అయోధ్యపురంలో గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన వైద్యుడు భీమగాని లక్ష్మీనారాయణ కుటుంబాన్ని సోమవారం రాత్రి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెల్పూరు వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత



కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్న 71మంది విద్యార్థులకు కర్నాటక రాష్ట్రంలో ఐజీగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి బానోత్ రమేశ్ స్నాక్స్ కోసం రూ.15వేలు పంపించారు. అలాగే పొన్నం మహేష్ రూ.3వేలు అందించారు. ఈమేరకు రూ.15వేలను ఐపీఎస్ అధికారి రమేశ్ తండ్రి బానోత్ రామోజీ చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎం.శ్రీలత, గ్రామ పెద్దలు రమేశ్, అర్జున్ చౌహాన్, వెంకన్న, ఉపాధ్యాయులు వెంకన్న, విజయలక్ష్మి పాల్గొన్నారు.